నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03.
25 అక్టోబర్ 2023
పేజీలు 8

**సిసో కౌన్సిల్**

దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో 'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో (చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్స్) కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కౌన్సిల్‌ను అక్టోబర్ 7న డీజీపీ అంజనీకుమార్ ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి ప్రారంభించారు. సైబర్ నేరగాళ్ల బారినపడిన బాధితులు వెంటనే 1930 లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.

# మణిపూర్‌లో నిర్వహించే జగన్నాథ రథయాత్రను ఏమని పిలుస్తారు?

## పుష్కర్ మేళా



- రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌కు దగ్గర్లో ఆరావళి పర్వత పాదంలో నెలకొన్న పుణ్యక్షేత్రం పుష్కర్. ఇక్కడ ఉన్న పుష్కర్ సరోవరం నుంచి దీనికి ఆ పేరు వచ్చింది. పుష్కర్‌లో సుమారు 400 దేవాలయాలు, 52 స్నాన ఘట్టాలు ఉన్నాయి. సృష్టికర్త బ్రహ్మదేవుడి ఆలయం ఉన్న ఏకైక ప్రదేశంగా పుష్కర్ ప్రసిద్ధిచెందింది.
- అయితే, కార్తిక మాసం వచ్చిందంటే అప్పటి వరకు నిశ్శబ్దంగా ఉన్న పుష్కర్ పరిసరాలు వివిధ వర్ణాల వస్త్రధారణతో చూడముచ్చటగా ఉండే రాజస్థానీ జానపదులు, ఇతర యాత్రికులతో నిండిపోతాయి. ఓవైపు సరస్సులో స్నానం చేసే భక్తులు, పూజలు చేసేవాళ్లు, పాటలు, జానపద సంగీతంతో పరిసరాలు కళకళలాడుతాయి. ఇవన్నీ ఒకెత్తు. ఇక్కడ జరిగే అతిపెద్ద ఒంటెల మేళా మరో ఎత్తు.
- పుష్కర్ మేళా కార్తిక శుద్ధ ఏకాదశి రోజున మొదలవుతుంది. పౌర్ణమి వరకు సుమారు 5 రోజులు సాగుతుంది. పుణ్యస్నానాలు చేయడానికి పెద్ద ఎత్తున ప్రజలు వస్తుండటంతో ఇక్కడ ఒంటెల అమ్మకం కూడా మొదలైంది. అయితే, ఇది ప్రధానంగా ఒంటెల మేళా అయినప్పటికీ, ఇక్కడ గుర్రాలు, ఆవులు, ఎద్దు, మేకలు, గొర్రెలు, బర్రెలు కూడా అమ్మకానికి వస్తాయి.
- ఒంటెలను రంగురంగుల దుస్తులతో, ముద్దువులు, పట్టెలతో అలంకరిస్తారు. ఈ విధమైన ఆహార్యంతో బంగారు రంగులో ఉండే థార్ ఎడారి ఇసుక దిబ్బల మీద ఒంటెలు నడుస్తూ ఉంటే ఆ సౌందర్యాన్ని మాటల్లో చెప్పలేం. ఇక్కడ ఒంటెలకు ముక్కులు కుట్టే వేడుక కూడా నిర్వహిస్తారు. పుష్కర్ మేళా ప్రపంచంలోనే అతిపెద్ద ఒంటెల జాతర.
- ఇక్కడి మరో విశేషం... ఒంటెల పోటీ. ఇందులో భాగంగా పోటీదారులు తమ ఒంటెలను ప్రదర్శనకు ఉంచుతారు. బాగా అలంకరించిన ఒంటెకు మొదటి బహుమతి ఇస్తారు. ఇంకా గుర్రాలు, ఒంటెలతో నృత్యం చేయించడం, ఎక్కువ మందిని మోసే ఒంటెకు బహుమతి ఇచ్చే 'లడ్డూ ఒంటె పోటీ' తదితర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం వేళల్లో రాజస్థానీ జానపద గేయాలు, నృత్యాలు అదనపు ఆకర్షణ.
- మేళా చివరిరోజున మేవాడీ, మేవాటీ, మార్వాడీ, జైసల్మేరీ, బికనేరీ, ఢూంఢానీ తదితర రాజస్థానీ పగిడీలను (తలపాగాలు) మేళా ప్రాంగణం అంతటా అలంకరిస్తారు. ఈ మేళాలోనే రాజస్థానీ హస్తకళలను కూడా ప్రదర్శిస్తారు.
- కార్తిక పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు చేసే వేడుకగా మొదలైన పుష్కర్ మేళా ఇప్పుడు పెద్ద సంఖ్యలో కనిపించే విదేశీ పర్యాటకులతో అంతర్జాతీయతను సంతరించుకుంది. దీన్ని రాజస్థాన్ పశుసంవర్ధక శాఖ, పర్యాటక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.
- బీహార్‌లో జరిగే సోనేపూర్ పశువుల మేళా కూడా దేశవ్యాప్తంగా ప్రసిద్ధిచెందింది. ఇది కూడా కార్తిక పౌర్ణమినాడే ప్రారంభం అవుతుంది. ఏనుగుల అమ్మకాలు జరగడం సోనేపూర్ మేళా ప్రత్యేకత.

## త్రిస్సూర్ పూరం



- కేరళలో ఘనంగా జరిగే ఉత్సవాల్లో పూరం ఒకటి. పూరం అంటే సమ్మేళనం అని అర్థం. ఇది సాధారణంగా ఏప్రిల్-మే నెలల్లో జరుగుతుంది. పూరం వేడుకల్లో అత్యంత వైభవంగా జరిగేది త్రిస్సూర్ పూరం. ఇది 36 గంటల పాటు జరుగుతుంది. త్రిస్సూర్ నగరం కేరళ సాంస్కృతిక రాజధానిగా ప్రసిద్ధిచెందింది.
- పూరం ఉత్సవం పరామెక్కవు భగవతి, తిరువంబాడి దేవి అనే ఇద్దరు దేవతలను పూజిస్తూ జరుపుకొంటారు. దీన్ని 200 సంవత్సరాల కింద శక్తన్ తంపురన్ (రాజా రామవర్మ) అనే కొచ్చి రాజవంశపు పాలకుడు ప్రారంభించాడు.
- పూరం ఉత్సవం కోసం ఏనుగులను బాగా అలంకరిస్తారు. వీటిని తీసుకుని పైన పేర్కొన్న రెండు ఆలయాల నుంచి పంచవాద్యాలుగా పేర్కొనే ఐదు వాద్యాలను వాయిస్తూ ఊరేగింపుగా బయల్దేరతారు. ఆ ఐదు వాద్యాలు తిమిల (తబలా లాంటిది), మద్దలం (మద్దెల), ఇడక్క (డక్క), ఇలతాళం (తాళాలు), కొంపు (కొమ్ముబూర).
- ఈ రెండు బృందాలు త్రిస్సూర్‌లో ఉండే వడక్కునాథన్ (శివుడు) ఆలయ ప్రాంగణానికి చేరుకుంటాయి. ఇక్కడ రెండు బృందాల వాళ్లు 300 పట్టు గొడుగులను ప్రదర్శించే సన్నివేశం చూసేవారిని ఆకట్టుకుంటుంది.
- పూరం రోజు రాత్రివేళలో పటాకులు కాలుస్తారు. మర్నాడు పంచవాద్య సమ్మేళనంతో ఉత్సవం ముగిసిపోతుంది. త్రిస్సూర్‌కు సమీపంలోని ఆరత్తుపుళలో జరిగే పూరం కూడా ప్రసిద్ధిచెందింది.

## నాగోబా జాతర



- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో ప్రతి ఏడాది పుష్య అమావాస్య నాడు మొదలై వారం రోజుల పాటు జరుగుతుంది. ఆదివాసీలైన గోండు, పర్ధాన్ తెగలవారు ఈ జాతర నిర్వహణలో ప్రధానపాత్ర పోషిస్తారు. ఈ జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల గోండులు తరలివస్తారు.
- జానపదుల ఆరాధనలో నాగులను పూజించడం ఒకటి. పూర్వం మెస్రం వంశానికి చెందిన నాగాయి మోతిరాణికి నాగేంద్రుడు కలలోకి వచ్చాడట. పాము రూపంలో ఆమె గర్భంలో జన్మిస్తానని చెప్పాడట. కొంతకాలానికి మోతిరాణికి నాగేంద్రుడు జన్మించాడు. పెరిగి పెద్దయిన అతనికి తన మేనకోడలు గౌరితో పెండ్లి జరిపించింది.
- ఓరోజు గౌరి భర్తను బుట్టలో పెట్టుకుని గోదావరిలో స్నానానికి వెళ్లింది. ఆమె దూరంగా ఉన్న సమయంలో అతను మనిషిగా మారిపోయాడు. మానవ రూపంలో ఉన్న భర్తను గౌరి తాకగానే అతను మళ్లీ పాముగా మారిపోయాడు. దాంతో బాధపడిన గౌరి గోదావరిలో కలిసిపోయింది. నాగేంద్రుడు కూడా గిరిజనులను కాపాడతానని చెప్పి, కేస్లాపూర్ గుట్టల్లో మాయమైపోయాడని కథ.
- ఇక నాగోబా జాతర ప్రారంభానికి ముందు కేస్లాపూర్ నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని కలమడుగు గోదావరి రేవు నుంచి కొత్త కుండల్లో నీళ్లు తీసుకుని కాలినడకన వస్తారు. జాతర సమయంలో ఈ నీటితోనే నాగోబాకు అభిషేకం చేస్తారు. జొన్నలు, మక్కజొన్నల గటక, అంబలి, కూరగాయలతో వండిన పదార్థాలను నాగోబాకు నైవేద్యంగా సమర్పిస్తారు.
- జాతర సమయంలోనే కొత్తగా పెండ్లయిన వారికి బేటింగ్ కార్యక్రమం నిర్వహిస్తారు. పితృ దేవతలను స్మరించుకుంటూ తూం అన్న కార్యక్రమం జరుపుతారు.
- జాతర చివరి రోజు నిర్వహించే గిరిజన దర్బార్ ప్రత్యేకమైంది. దీనికి అధికారులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరవుతారు. గోండులు, పర్ధాన్ల సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని 1946లో ప్రముఖ ఆంత్రపాలజిస్టు హైమన్‌డార్ఫ్ మొదలుపెట్టారు.

## సమ్మక్క- సారక్క



- భారతదేశంలో జరిగే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క-సారక్క జాతర. రెండేండ్లకు ఓసారి జరిగే ఈ జాతరకు వేదిక ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామం. ఒకప్పుడు చిన్నపాటి ఉత్సవంగా మొదలైన సమ్మక్క-సారక్క జాతర ఇప్పుడు అతిపెద్ద గిరిజన ఉత్సవంగా మారిపోయింది. ఈ జాతరను 1996లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా ప్రకటించారు.
- నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరవుతారు. సమ్మక్క-సారక్క వనదేవతలకు బంగారం (బెల్లం) సమర్పించుకుని తమ భక్తిని చాటుకుంటారు.
- జాతర మాఘ పౌర్ణమినాడు మొదలవుతుంది. ఆ రోజు సాయంత్రం సారక్కను మేడారం దగ్గర్లోని కన్నెపల్లి గ్రామం నుంచి తీసుకువచ్చి, గద్దె మీద నిలపడంతో జాతర మొదలవుతుంది. ఆ మరునాటి సాయంత్రానికి ప్రధాన దేవత, కుంకుమ భరిణ రూపంలో ఉన్న సమ్మక్కను చిలుకల గుట్ట నుంచి తీసుకువస్తారు. సమ్మక్క గద్దె మీద నిలుపుతారు.
- ఈ ఇద్దరు దేవతలకు ప్రతిరూపంగా గద్దెల మీద రెండు వెదురు కర్రలు కుంకుమ, పసుపు పూసి ఉంటాయి. వనదేవతల ఆశీర్వాదాలను కోరి వచ్చే భక్తులు దారిపొడవునా సిగాలు ఊగుతూ వస్తారు.
- గిరిజనులు చెప్పే కథ ప్రకారం... అడవిలో వేటకు వెళ్లిన స్థానిక గిరిజన నాయకుడికి దారిలో దేదీప్యమైన కాంతులు వెదజల్లుతూ, పులుల మధ్య ఆడుకుంటున్న ఓ శిశువు కనిపించింది. ఆ బాలికను తమ గూడేనికి తీసుకువెళ్లి సమ్మక్క అని పేరు పెట్టాడు. ఆ బాలిక వివాహ వయసుకు రాగానే ఆమెను కాకతీయుల సామంతుడైన పగిడిద్దరాజుకు ఇచ్చి పెండ్లి చేశాడు.
- ఈ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న జన్మించారు. తర్వాత కొంత కాలానికి ఆ ప్రాంతంలో తీవ్రమైన కరువు సంభవించింది. దాంతో పగిడిద్దరాజు కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడికి కప్పం కట్టలేకపోయాడు. ఆగ్రహించిన చక్రవర్తి పగిడిద్దరాజు మీదికి దండెత్తాడు. సంపెంగ వాగు సమీపంలో యుద్ధం జరిగింది. అందులో పగిడిద్దరాజుతోపాటు సారక్క, ఆమె భర్త గోవింద రాజు, నాగులమ్మ వీరమరణం పొందారు. జంపన్న సంపెంగ వాగులో మరణించాడు. అప్పటినుంచి ఆ వాగును జంపన్న వాగు అని పిలుస్తున్నారు.
- విషయం తెలుసుకున్న సమ్మక్క కూడా కదనరంగంలోకి అడుగుపెట్టింది. ఆమె పరాక్రమానికి ఆశ్చర్యపడిన కాకతీయ ప్రధాన మంత్రి సంధి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అయితే, చనిపోయిన తనవారి తరపున యుద్ధం కొనసాగించాలని సమ్మక్క నిర్ణయించుకుంది.
- అయితే, సమ్మక్క యుద్ధంలో తీవ్రంగా గాయపడింది. అలానే చిలుకల గుట్టవైపు వెళ్లిపోయి, మాయమైపోయింది. కోయలంతా బాధతో తమ నాయకురాలి కోసం అడవిలో వెతికారు. ఒక దగ్గర వారికి ఓ కుంకుమభరిణ, ఓ ఆడపులి ముద్ర కనిపించాయట. అది సమ్మక్క శిశువుగా దొరికిన చోటే జరిగిందని అంటారు. అప్పటినుంచి కోయలు, వడ్డెరలు సమ్మక్క, సారక్క త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేండ్లకు ఓసారి జాతర నిర్వహిస్తున్నారు.

## జగన్నాథ రథయాత్ర

- ఒడిశా రాష్ట్రంలోని ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం పూరీలో ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో జరిగే ఉత్సవమే జగన్నాథ రథయాత్ర. దీనికి జగన్నాథ దేవాలయం వేదిక. ఇక్కడ శ్రీకృష్ణుడిని జగన్నాథుడిగా పూజిస్తారు.
- పూర్వం ఈ ప్రాంతాన్ని ఇంద్రద్యుమ్నుడు అనే రాజు పాలించేవాడు. ఆయనకు జగన్నాథుడు కలలో కనిపించి తనకు పురుషోత్తమ శ్రీక్షేత్రం (పూరీ)లో ఆలయం నిర్మించాలని చెప్పాడు. అంతేకాదు తాను కొయ్యదుంగ రూపంలో 'దారుబ్రహ్మ'గా సముద్ర తీరానికి కొట్టుకు వస్తానని చెప్పాడు. అలా భగవంతుడి ఆజ్ఞ మేరకు నిర్మించిందే ఈ జగన్నాథ దేవాలయం అని కథ.



- పూరీలో మొదట గర్భాలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత మిగిలిన నిర్మాణాలు కాలానుగుణంగా జోడిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఉన్న జగన్నాథుడి మహా మందిరాన్ని కళింగ గాంగ రాజులు నిర్మించారు. నిర్మాణం క్రీ.శ 1112 నుంచి 1198 మధ్య కాలంలో జరిగింది.
- జగన్నాథ దేవాలయం నీలాచలం మీద నెలకొంది. ఆలయానికి మేఘనాద్ ప్రాచీర్‌గా పిలిచే బలమైన కుడ్యం ఉన్న ప్రాకారం ఉంది. ముఖద్వారం తూర్పు ముఖంగా ఉంటుంది. ప్రధాన ఆలయాన్ని 4 భాగాలుగా విభజించవచ్చు. అవి... బిమానంతో (శిఖరం) ఉన్న గర్భాలయం. దీన్ని దేవుల్ అంటారు. ఇందులోనే జగన్నాథుడు, ఆయన అన్న బలరాముడు (బలభద్రుడు), వారి చెల్లి సుభద్ర, జగన్నాథుడి ఆయుధం సుదర్శన చక్రం దారు విగ్రహాలు కొలువుదీరాయి. దీనికి ముందు ముఖమండపం (జగ్‌మోహన్), ఆ తర్వాత నాటమందిర్ (నాట్యమందిరం), భోగమండపం వరుసగా వస్తాయి. భోగమండపం అంటే భక్తులు భగవంతుడికి తమ నివేదనలు జరుపుకొనే స్థలం.
- పురుషోత్తమ్ శ్రీక్షేత్రంలో ఏడాది పొడవునా వేడుకలు, ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. వీటిలో రథయాత్ర అత్యంత ప్రధానమైంది. ఆషాఢ శుక్ల విదియ నాడు జరుపుకొనే ఈ ఉత్సవాన్ని 'గుండీచా యాత్ర' అని కూడా పిలుస్తారు. పహండీగా పిలిచే ఊరేగింపుతో గర్భాలయంలోని విగ్రహాలను బాగా అలంకరించిన మూడు రథాల దగ్గరికి తీసుకువస్తారు. ఆ తర్వాత వాటిని రథాల్లో ఉంచి వేలాది భక్తులు లాగుతుండగా జగన్నాథుడు, తన సోదరుడు, సోదరి, సుదర్శన చక్రంతో కలిసి ఆలయం నుంచి గుండిచా మందిరానికి తరలివెళ్తాడు. తొమ్మిది రోజుల తర్వాత మళ్లీ ఆలయానికి వస్తాడు.
- జగన్నాథుడి రథం పేరు నందిఘోష, బలరాముడి రథం తాళధ్వజ, సుభద్ర రథం దేవదళన్ లేదా దర్పదళన్. వీటిలో అన్నిటికంటే జగన్నాథుడి రథం ఎత్తుగా ఉంటుంది. అయితే, సుమారు ప్రతి పన్నెండేళ్లకు ఓసారి దేవతల విగ్రహాలను వేప దారువుతో కొత్తగా తయారుచేస్తారు. దీన్ని 'నబకళేబర' ఉత్సవంగా పిలుస్తారు.
- మణిపూర్‌లో నిర్వహించే జగన్నాథ రథయాత్రను 'కంగ్‌చింగ్ బా' అంటారు.

సంకలనం
హర్షవర్ధన్ చింతలపల్లి